


సివిల్ సర్వీసెస్-2026 పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్, మెయిన్స్) పరీక్షల ఉచిత శిక్షణ కోసం వచ్చే నెల ఐదో తేదీన రాజమహేంద్రవరంలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి ఆర్‌వి.నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ కోసం జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులలిస్టులు, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ (రూ.లక్ష లోపు) పత్రం, ఆధార్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఏలూరులోని వెన్నవల్లివారిపేట బిఆర్.అంబేద్కర్ స్కూల్ బిసి స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారికి వచ్చే నెల 8వ తేదీ నుంచి కృష్ణాజిల్లా గొల్లపూడి బిసి స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, బస, భోజన వసతి ఉంటుందని తెలిపారు.

పంచాయతీ రిజర్వేషన్లపై ఉత్కంఠ..!



రిజర్వేషన్లు అనుకూలంగా చూడాలని ఎంఎల్‌ఎల వద్దకు నేతల క్యూ
అభ్యర్థుల ఎంపికపై నాయకుల కసరత్తు
ఎన్నికలపై సిఎం వ్యాఖ్యలతో గ్రామాల్లో హడావిడి
ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. రిజర్వేషన్ల కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న కేటగిరిని బట్టి రిజర్వేషన్ ఏవిధంగా వస్తుందో ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. కీలకమైన పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చేటట్లు చూడాలని స్థానిక నేతలు ఎంఎల్‌ఎల వద్దకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలుచోట్ల బిసి, ఎస్‌సిలకు కేటాయించాల్సిన స్థానాలు జనరల్‌కు కేటాయించే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా మేజర్ పంచాయతీలపై స్థానిక నేతలు తమకు అనుకూలంగా రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎలు సైతం స్థానిక నేతలకు రిజర్వేషన్లపై భరోసా ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం నెలకొంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2020 మార్చి నాటికి పంచాయతీ ఎన్నికలు విడతలవారీగా పూర్తయ్యాయి. ఐదేళ్ల కాలం పూర్తవుతుండటంతో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని ప్రభుత్వం చూస్తున్నట్లు సంకేతాలు ఉన్నాయి. గడిచిన సెప్టెంబర్ మూడో తేదీన ప్రీ ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. అందులో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. గడిచిన బుధవారం సిఎం చంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో మూడు, నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ సూచించారు. దీంతో పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించే అవకాశం ఉందనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో హడావిడి మొదలైంది. అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టాలనే కసరత్తు ప్రారంభించారు. జనరల్‌కు వస్తే ఎలా, బిసి, ఎస్‌సి రిజర్వేషన్ వస్తే ఎవరిని బరిలో దింపాలనే ప్రణాళికలు వేస్తున్నారు. ప్రస్తుతం బిసి రిజర్వేషన్లు కొనసాగుతున్న చోట ఎస్‌సిలకు కాకుండా జనరల్‌కు వచ్చేలా చేయాలని స్థానిక నాయకులు ఎంఎల్‌ఎలను కలుస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రిజర్వేషన్లను ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉందా అంటూ బిసి, ఎస్‌సి నేతలు ఆరా తీస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే ఏం చేయాలనే లెక్కలు సైతం వేస్తున్నారు. రిజర్వేషన్ కోటా మహిళలకు వస్తే ఎవరిని నిలబెట్టాలనే చర్చలు సైతం సాగుతున్నాయి. జనవరిలో జనాభా లెక్కల ప్రక్రియ మొదలు కానుంది. అందుకు సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత పంచాయతీ ఎన్నికలు ఉంటాయా.. సమాంతరంగా ఎన్నికల ప్రక్రియ సాగుతుందా అనే చర్చ సైతం నడుస్తోంది. ప్రీ ఎన్నికల ప్రక్రియ సాగితే షెడ్యూల్ విడుదల చేస్తే డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు, వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, రిటర్నింగ్ అధికారులను నియమించడం, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి ప్రక్రియ సాగాల్సి ఉంటుంది. జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల షెడ్యూల్ వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకూ సమయం ఉంది. అప్పటి వరకూ ఆగి పంచాయతీ, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారా.. లేక పంచాయతీ ఎన్నికలను ముందుగానే జరిపిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏదేమైనప్పటికీ గ్రామాల్లో మాత్రం పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది.

రిజర్వేషన్ మారినా పెత్తనం చేసేలా ప్రణాళికలు

పలు కీలకమైన పంచాయతీలకు సంబంధించి జనరల్ కేటగిరికి వచ్చే విధంగా చేయాలని స్థానిక నేతలు ఎంఎల్‌ఎలకు చెబుతున్నారు. ఒకవేళ అలా జరగకపోతే పంచాయతీలో పెత్తనం పోకుండా ప్రణాళికలు సైతం వేస్తున్నారు. ఎస్‌సి, బిసి రిజర్వేషన్ వస్తే వార్డు మెంబర్‌గా గెలిచి వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పంచాయతీపై పెత్తనం చేసేలా పలు గ్రామాల్లో ఆలోచనలు సైతం చేస్తున్నారు. బిసి, ఎస్‌సి అభ్యర్థులు గెలిచిన చోట సైతం తామే చక్రం తిప్పేలా వ్యూహాలు రచిస్తున్నారు. జనరల్ కేటగిరి కోటా వస్తే భారీ ఖర్చు భరించాల్సి ఉంటుందని, అదే బిసి, ఎస్‌సి కేటగిరికి వస్తే తక్కువ ఖర్చు అవుతుందని, వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పెత్తనం చేయవచ్చనే లెక్కలు సైతం మరికొందరు నేతలు వేస్తున్నారు. రిజర్వేషన్ల కేటాయింపును తమకు అనుకూలంగా చేసుకుని ముందుకు సాగాలనే యోచనలో నేతలు ఉన్నట్లు కనిపిస్తోంది. రిజర్వేషన్ల ప్రక్రియలో అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ప్లేటు తెచ్చుకుంటానని వెళ్లి విగతజీవిగా..!

తరగతి గదిలోనే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



నినదిస్తున్న నేతలు, బంధువులు

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని పొడపాటి కావ్య (14) శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్యకు పాల్పడింది. జంగారెడ్డిగూడెం ఉప్పల మెట్టలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కావ్య మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులంతా భోజనానికి వెళుతుండగా తాను ప్లేటు మర్చిపోయానని చెప్పి వెనక్కి వెళ్లింది. అలా తరగతి గదికి వెళ్లిన కావ్య ఎంతసేపటికీ రాకపోవడంతో విద్యార్థినులు వెనక్కి వెళ్లి చూడగా తరగతి గదిలోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఉండటం చూసి కేకలు వేశారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని కావ్యను హుటాహుటీన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే కావ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కావ్య తండ్రి గంగాధర్ కారు డ్రైవర్ కాగా, తల్లి ఉషారాణి కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు. వారికి ముగ్గురు కుమార్తెలు పెద్దకుమార్తె కావ్య ఐదో తరగతి నుంచి ఈ గురుకుల పాఠశాలలోనే చదువుతుంది. చదువులోనూ ముందుంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. సిఐ సుభాష్ పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తరగతి గదిలోనే పోలీసులకు సూసైడ్ నోట్ లభించినట్లు సమాచారం.



కావ్య

కావ్య ఆత్మహత్యకు కారణాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని, ఆ పాఠశాలలో తరచూ చోటుచేసుకుంటున్న ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన బంధువులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సుభాషిణి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, సిఐటియు మండల కార్యదర్శి పి.సూర్యారావు, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి డి.నాగేంద్ర మాట్లాడుతూ అదే పాఠశాలలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడడానికి వెనుక గల కారణాలపై నిగ్గు తేల్చాలని, బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బాలిక కుటుంబ సభ్యులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావు, పట్టణాధ్యక్షులు కర్పూరం గుప్తా, మండలాధ్యక్షులు ఓరుగంటి నాగేంద్ర, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను తదితరులు పరామర్శించారు.

3వ రోజు కొనసాగిన మొక్కజొన్న విత్తన రైతుల దీక్షలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



నినదిస్తున్న రైతులు

మొక్కజొన్న విత్తన పంట బకాయిల కోసం పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలో ఆర్గనైజర్ చేతిలో మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతుల రిలే దీక్షలు శుక్రవారం మూడో రోజు కొనసాగాయి. మా పంట డబ్బులు ఇప్పించి ఆదుకోండి అంటూ బాధిత మొక్కజొన్న విత్తన రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి గుర్రం రాంబాబు మాట్లాడుతూ విత్తన రైతులకు ఇవ్వాల్సిన రూ.లక్షల బకాయిలు ఇవ్వకుండా ఎగ్గొట్టిన ఆర్గనైజర్‌పై వెంటనే చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరారు. సీడ్ ఆర్గనైజర్‌ను అరెస్టు చేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. దీక్షల్లో బాధిత మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు, వీరవల్లి మోహనరావు, వీరవల్లి నాగ వెంకట్రావు, వీరవల్లి నాగరాజు, వీరవల్లి నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

అవినీతి చేయండి.. సొమ్ము కట్టేయండి

ఆర్‌టిసి అధికారుల సొంత రాజ్యాంగం
అవినీతి సొమ్ము తిరిగి కట్టేస్తే చర్యలు ఉండవట
ప్రధాన సూత్రధారులపై కేసు పెట్టకుండా గూడుపుఠాణి
ఏలూరు డిపో మేనేజర్‌తో సహా 9 మంది రూ.50 లక్షలకుపైగా చెల్లింపు
తప్పు చేయలేదు.. డబ్బులు చెల్లించబోమని చెప్పిన నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'విచ్చలవిడిగా అవినీతి చేసుకోండి.. ఒకవేళ బయటపడితే ఎంతోకొంత సొమ్ము చెల్లించండి.. ఇక మీపై ఎటువంటి చర్యలూ ఉండవు అంటూ ఆర్‌టిసి అధికారులు సరికొత్త రాజ్యాంగం రాసుకుని ముందుకు సాగుతున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి జరిగితే ముందు విచారణ చేయాలి. విచారణలో ప్రధాన సూత్రధారులుగా తేలినవారిపై పోలీస్ కేసు పెట్టాలి. విధుల నుంచి తొలగించాలి. తర్వాత సొమ్మును రికవరీ చేయాల్సి ఉంటుంది. ఆర్‌టిసి ఏలూరు డిపో పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతి వ్యవహారం మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతోంది. అసలు నేరస్తులను కాపాడేందుకు ఏ తప్పు చేయని ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేయడం తీవ్ర దుమారం రేగుతోంది. అవినీతి చేసినట్లు ఒప్పుకుని డబ్బు చెల్లించినవారికి మాత్రం రాచమర్యాదలు చేస్తున్న పరిస్థితి. చేయని తప్పునకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్యతోసహా నలుగురు ఆర్‌టిసి ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఆ శాఖలో తీవ్ర దుమారం రేపుతోంది. వివరాల్లోకెళ్తే ఏలూరు ఆర్‌టిసి డిపో పక్కన 2021లో ఆర్‌టిసి యాజమాన్యం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. బంకు నిర్వహణకు తగిన విధివిధానాలు రూపొందించకుండా, కిందిస్థాయి ఉద్యోగులను అక్కడ సూపర్‌వైజర్లుగా ఏర్పాటు చేసి నడిపించేశారు. మూడు నెలల క్రితం విజయవాడ నుంచి వచ్చిన ఆడిట్ సిబ్బంది చేపట్టిన ఆడిట్‌లో పెట్రోల్ బంకులో అవినీతి జరిగినట్లు, రూ.83 లక్షల సొమ్ము పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీంతో విజయవాడ నుంచి వచ్చిన ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం విచారణ చేపట్టి రూ.83 లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. చట్టప్రకారం ఆర్థికపరమైన అవినీతి జరిగిందని గుర్తించిన వెంటనే సదరు అధికారులపై ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఆపై తదుపరి విచారణకు ఆటంకం లేకుండా, సాక్ష్యాలు తారుమారు చేయకుండా ఉండేందుకు సదరు ఉద్యోగులను సస్పెండ్ చేయాలి. ఇవేమీ ఇక్కడ జరగలేదు. అవినీతి వ్యవహారంలో డిపో మేనేజర్‌తో సహా మొత్తం 13 మందిని అవినీతికి బాధ్యులను చేస్తూ మొత్తం రూ.83 లక్షల సొమ్ము తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో తొమ్మిది మంది ఉద్యోగులు నేరాన్ని ఒప్పుకుని రూ.50,30,563 సొమ్ము గత అక్టోబర్‌లో చెల్లించారు. నలుగురు ఉద్యోగులు మాత్రం ఈ అవినీతితో తమకు సంబంధం లేదని, సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. తాము తప్పు చేయలేదని చెబుతున్న ఉద్యోగులను ఈ నెల 19వ తేదీ బుధవారం సాయంత్రం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్‌టిసి కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరు డిపో వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అవినీతిపై పోలీసులతో విచారణ జరిపించి అసలు నేరస్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, ఒకవేళ తమ కార్మికులు అవినీతికి పాల్పడినట్లు రుజువైతే జైలు శిక్ష వేసినా అనుభవిస్తామని నేతలు స్పష్టం చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగుల్లో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఆడిట్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ సిహెచ్.సుందరయ్య, ఏలూరు డిపో సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, ఏలూరు డిపో మెకానికల్ ఫోర్‌మెన్ ఐ.ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ డిపో క్లర్క్ జె బాలరాజు ఉన్నారు.

సొమ్ము తిరిగి చెల్లించిన అధికారులు

పేరు	చెల్లించిన సొమ్ము
1.బి.వాణి, ఏలూరు డిపో మేనేజర్	రూ.12,08,026
2.ఎస్.గిరిధర్‌కుమార్, ప్రస్తుత తణుకు డిపో మేనేజర్	రూ.63,566
3.వివిఎస్.మూర్తి, అక్కౌంట్స్ ఆఫీసర్	రూ.10,90,708
4.జివిఎల్‌పివి.సుబ్బారావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్	రూ.10,02,496
5.కె.నాగేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్	రూ.5 లక్షలు
6.ఎంవి.రావు, ప్రస్తుతం పల్నాడు జిల్లా అకౌంట్స్ ఆఫీసర్	రూ.1,42,722
7.ఎం.శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్, ఏలూరు డిపో	రూ.5 లక్షలు
8.కెఆర్‌ఎస్.శర్మ, ప్రస్తుతం శ్రీకాకుళం డిపో మేనేజర్	రూ. 23,046
9.ఎస్.రంగనాథ్, జూనియర్ అసిస్టెంట్	రూ.5 లక్షలు
మొత్తం	రూ.50,30,563



ఏలూరు డిపో వద్ద ఇయు ఆధ్వర్యాన ధర్నా

అవినీతి చేస్తే చర్యలు ఉండవా..?

ఏలూరు డిపో మేనేజర్ బి.వాణితో సహా తొమ్మిది మంది ఉద్యోగులు రూ.50 లక్షలకుపైగా సొమ్ము చెల్లించడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. లక్షల్లో సొమ్ము చెల్లించారంటే వారంతా నేరాన్ని ఒప్పుకున్నట్లే అనే ప్రశ్న తలెత్తుతుంది. జిల్లాస్థాయి అధికారుల నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు అవినీతిని పక్కదారి పట్టించి, మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుంది. 2021 నుంచి ఈ అవినీతి జరిగినట్లు తెలుస్తున్న నేపథ్యంలో అప్పటి నుంచి పని చేసిన ఉన్నతస్థాయి అధికారులపైనా విచారణ జరపాల్సిన అవసరం ఉంది. అవినీతి అధికారులను కాపాడుతున్న ప్రస్తుత ఆర్‌టిసి అధికారులపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డీజిల్ అక్రమాలపై విచారణ జరపాలి

నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : సిఐటియు జిల్లా కమిటీ

ఆర్‌టిసి ఏలూరు డిపో పరిధిలో రిటైల్ ఆయిల్ ఔట్‌లెట్ విభాగంలో ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధమూ లేని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.సుందరయ్యతోసహా మరో ముగ్గురు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తూ అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని తప్పించి సామాన్యులను బలి చేయడం దుర్మార్గమని విమర్శించారు. అన్యాయంగా సస్పెండ్ చేసిన సిహెచ్.సుందరయ్యను, మరో ముగ్గురిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సస్పెన్షన్లు ఉపసంహరించాలి

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్‌రావు

ఆర్‌టిసి పెట్రోల్ బంకు స్కామ్‌కు సంబంధం లేని ఉద్యోగుల సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్‌రావు డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్ బంకు నిర్వహణలో అవకతవకలపై పోలీసులకు ఫిర్యాదు చేసి దర్యాప్తు చేయించకుండా అధికారులే ఏకపక్షంగా బాధ్యులను ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. తొమ్మిది మంది అధికారులతో రూ.50 లక్షలకుపైగా కట్టించుకుని వారిని కేసు నుంచి తప్పించడం ఏమిటని, తమకు సంబంధం లేదని మొత్తుకుంటున్నా వినకుండా డబ్బు కట్టలేదని నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం అక్రమ సస్పెన్షన్లను వెనక్కి తీసుకుని డీజిల్ స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తాము వివిధ రూపాల్లో పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు నిర్వహించిన ధర్నాలో యూనియన్ డిపో గౌరవ అధ్యక్షులు వై.శ్రీనివాస్ మాట్లాడారు.

డ్రగ్స్‌రహిత జిల్లాగా ఏలూరు

మాదకద్రవ్యాల కేసుల్లో పట్టుబడితే కఠిన శిక్షలు
మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



యువత ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యరహిత జిల్లాగా ఏలూరును రూపొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల జోలికెళ్తే భవిష్యత్తు అంధకారమవుతుందని యువతలో అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. వినియోగం, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, దుష్పరిణామాలపై ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన కలిగించేందుకు ప్రతి పాఠశాల, కాలేజీలోనూ పోస్టర్ల ద్వారా తెలియజేయడంతో పాటు సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారికి డి అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందిస్తామన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించకుండా ఔషధ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్‌భాషా, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామకుమార్, జిల్లా ప్రజా రవాణాధికారి షబ్నమ్, ఈగల్ టీమ్ ఇన్‌ఛార్జి బి.ఉదయభాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి జి.కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



ఈ నెల 26న నిర్వహించే మాక్ అసెంబ్లీకి గోపాలపురం నియోజకవర్గం నుంచి ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి హై స్కూల్ విద్యార్థి నాలబాలాజీ ఎంపికయ్యాడు. పాఠశాల, మండలం, నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో నాగబాలాజీ ప్రతిభ కనబరిచాడు. జి.కొత్తపల్లి గ్రామం నుంచి అసెంబ్లీలో గోపాలపురం ఎంఎల్‌ఎగా వెళ్లడం ఎంతో అభినందనీయమని గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి : డివైఇఒ

మండవల్లి :క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా చేయాలని డివైఇఒ రవీంద్ర భారతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు బోధన పద్ధతులను వివరించి పాఠశాలలోని వసతులపై పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి వారికి ఆశ్రయం కల్పించి వైద్య సహాయం అందేలా ఏర్పాటు చేస్తున్న మనోబంధు ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. మనోబంధు ఫౌండేషన్ వాల్‌పోస్టర్‌ను ఎస్‌పి తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు జిల్లాలో పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మనో బంధు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత అక్టోబర్ 23 నుంచి రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని, మతిస్థిమితం కోల్పోయి, రోడ్ల పక్కన తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి మనోబంధు ఫౌండేషన్ వారు ఆశ్రయం కల్పించి, వారికి విశాఖపట్నంలో వైద్య సహాయం అందే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బాగుపడిన రోగులను వారి కుటుంబ సభ్యులకు అప్పచెప్తారని, ఒకవేళ వారి కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోతే మనోబంధు ఫౌండేషన్ వారే వారికి ఆశ్రయం కల్పించే ఏర్పాటు చేస్తారని బెన్నీ తెలిపారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లోని రోడ్ల పక్కన ఎవరైనా మతిస్థిమితం లేని మానసిక రోగులు కనిపిస్తే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు బి.సురేష్, ఇ.సత్యసాయికిరణ్, నారాయణ, రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ వి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

క్రీడల్లో ప్రావీణ్యత సంపాదించాలి

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ
బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

క్రీడల్లో మంచి ప్రావీణ్యత సంపాదించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీలు బెతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాకా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా డిఇఒ వెంకటలక్ష్మమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సుధాకర్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ అలివేలు మంగ, ప్రముఖులు ఘంటా ప్రసాద్, బిస్ స్కూల్ అధినేత బండి శ్యామ్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాదిలో రోడ్ల పనులు పూర్తి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గంలో సంవత్సరం కాలంలో రోడ్ల పనులు పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రూ.1.50 కోట్లతో నిర్మించనున్న చింతలపూడి నుంచి టి.నర్సాపురం నాలుగు కిలోమీటర్ల బిటి రోడ్డు పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతలపూడి నుంచి ఏలూరు, మేడిశెట్టివారిగూడెం రోడ్డుకు రూ.4.14 కోట్ల నిధులు మంజూరవుతున్నాయని చెప్పారు. కామవరపుకోట రోడ్డు మరమ్మతులకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. రంగాపురం, తడికలపూడి, జీలకర్రగూడెం రోడ్డుకు రూ.2.90 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని చెప్పారు. చింతలపూడి-ధర్మాజీగూడెం సీసీ రోడ్డుకు రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. చింతలపూడి నగర పంచాయతీకి రూ.మూడు కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులు కూడా రూ.నాలుగు కోట్లు మంజూరవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

అభివృద్ధిలో దూసుకుపోతున్న నూజివీడు

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గం రూ.200 కోట్లతో అభివృద్ధిలో దూసుకుపోతుందని మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో టిడిపి మండల, గ్రామ అధ్యక్షులు, బూత్ ఇన్‌ఛార్జులు మంత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యులందరూ కలిసి పార్టీ బలోపేతానికి పని చేయాలన్నారు. పార్టీలో భిన్న అభిప్రాయాలు సర్వసాధారణమని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని చెప్పారు. ఎన్నికైన వివిధ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు ఈ బాధ్యత రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, టిడిపి అధిష్టానానికి, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలని తెలిపారు. క్రమశిక్షణతో పని చేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు, నూజివీడు నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, రఘు, వాసు, శ్రీనివాసు, వేణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని ఎపి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు తెలిపారు. టిడిపి మండలాధ్యక్షులు సాయి ఇంటి ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి రోడ్లు, డ్రెయినేజీలు, నిర్వాసిత కాలనీల్లో వసతులు వంటి వాటిపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అసపర్తి వెంకటనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమసుందరం, ఎంపిటిసి సభ్యులు నాళి శ్రీను, రవి, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, కిరణ్, సాయి, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పెన్నిధి సిఎంఆర్‌ఎఫ్

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిఎం సహాయ నిధి నిరుపేదలకు పెన్నిధి వంటిదని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న పది మందికి మంజూరైన రూ.7.33 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ బాలరాజు చేతులమీదుగా లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, సాంబ, దుర్గారావు, నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం జనవాణి

ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మంగళవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఆయా మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేలేరుపాడు రూరల్ :సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందించారు. మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన కర్నాటి సునీత ఆరోగ్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకోగా రూ.40 వేల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో వేలేరుపాడు జనసేన నాయకులు దేవిరెడ్డి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అందరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

సామాజిక బాధ్యతతో ముందుండే యువతకు ఆదర్శంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మరోసారి రక్తదానం చేసి ముందున్నారు. జంగారెడ్డిగూడెం సెంట్రల్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ వద్ద బుట్టాయగూడెం మండలం గుళ్లపూడి గ్రామానికి చెందిన ఒక గిరిజన మహిళకు రక్తం అత్యవసరమైంది. సమాచారం అందిన వెంటనే భాస్కర్ ఆక్కడికి చేరుకుని రక్తదానం చేశారు. ఇప్పటివరకు 27 సార్లు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని రక్షించడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన చెప్పారు. సామాజిక బాధ్యతతో ప్రతిఒక్కరూ ముందుకొచ్చి రక్తదానాన్ని అలవాటు చేసుకోవాలని భాస్కర్ పిలుపునిచ్చారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండలవ్యవసాయ అధికారి జి.వెంకటమణి అన్నారు. మండలంలోని పెయ్యేరులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వెంకటమణి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు తీసుకురావాలని సూచించారు. రబీలో వేయబోయే మినుము పైరుకు కేజీ విత్తనానికి ఒక గ్రాము కార్బెండిజంతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి వేణుమాధవ్ మాట్లాడారు. అనంతరం పొలంబడి రైతులకు బిఎంఎం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిపై సమగ్ర విచారణ చేపట్టండి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య విభాగానికి చెందిన వైద్యులు రోగులతో దురుసుగా ప్రవర్తించడం, కళ్లజోళ్లు, మందులు ప్రయివేట్ షాపులకు రాస్తున్నారని ప్రభుత్వానికి ప్రజాదర్బార్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణ పరిధిలోని కప్పల వెలమపేటకు చెందిన నవుడు రామకృష్ణ స్వామి ఫిర్యాదు చేశారు.

బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని బిస్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అండర్-17 బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ, నూజివీడు ఉప విద్యాశాఖాధికారి డాక్టర్ పి.ఎస్.సుధాకర్, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ అలివేలుమంగ మాట్లాడారు. అండర్ 17 బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పోటీలు నూజివీడులో నిర్వహించడం ఎంతో సమంజసమన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, కోచ్, సీనియర్ పీడీ, డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు 13 జిల్లాల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. బిస్ స్కూల్ ఛైర్మన్ బండి శ్యాం, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని చావలిపాడు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైకలూరు మండలం ఆలపాడుకు చెందిన పడమట సత్యనారాయణ (22) మండవల్లిలోని సియోనిస్ ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్‌లో గత నాలుగేళ్ల నుంచి పని చేస్తున్నాడు. శుక్రవారం యథావిధిగా సియోనిస్ ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్‌కు బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. అదే సమయంలో మండవల్లి నుంచి కైకలూరు మరో బైక్ వస్తుంది. ఈ రెండు బైకులు చావలిపాడు రైల్వే గేటు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పడమటి సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పైఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామచంద్రరావు తెలిపారు.

అద్దె భవనాల్లో పాఠశాలల నిర్వహణ

శిథిలావస్థకు చేరడంతో భయాందోళన

సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వసతి సౌకర్యంతో పాటు విద్యాబోధన ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. కనీసం స్కూల్ భవనం, కనీస సౌకర్యాలు లేకుండా ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను ఎలా పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చింతలపూడి మండలంలోని ఎండపల్లి, సుప్రీంపేట, లింగగూడెం, గురుభట్లగూడెం ప్రభుత్వ పాఠశాల భవనాలు లేక అద్దె భవనాల్లో పాఠశాలలు నడుపుతున్నారు. యండపల్లిలో పాత పంచాయతీ భవనంలో విద్యార్థులకు తరగతి గదులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇవిఆర్‌సిఎం, సిఎస్ఐ ఆధ్వర్యంలో పాఠశాలలు నడిచేవి. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన మెర్జ్‌తో ఇప్పుడు విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ఎండపల్లి ఎంపిపి స్కూల్ పాత పంచాయతీ భవనంలో నడుపుతున్నారు. ఆ భవనం స్లాబ్ పగుళ్లు రావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పాత పంచాయతీ భవనం పక్కన బురద కాలువ ఉండడంతో దోమలు దాడి చేస్తున్నాయని, ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఆయా పాఠశాలల పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు నివేదిక అందించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు, ఇబ్బందులతో విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి పెడతారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. యండపల్లి గ్రామంలో పాఠశాల భవనం నిర్మించుకోవడానికి స్థలం ఉందని, అందుకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. నాలుగు పాఠశాలలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల సొంత భవనం నిర్మించి వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. దీనిపై చింతలపూడి ఎంఇఒ రామారావును వివరణ కోరగా జిల్లా అధికారుల దృష్టిలో పెట్టామని తెలిపారు.



పాఠశాల ఆవరణలో మురుగు




అద్దె భవనంలో నిర్వహిస్తున్న పాఠశాల

డిప్యూటీ సిఎం పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారకాతిరుమల మండలం జగన్నాధపురం గ్రామంలో ఈ నెల 24వ తేదీన పర్యటించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ శుక్రవారం పరిశీలించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఉప ముఖ్యమంత్రి పర్యటించే మార్గాలు, సభ స్థలాలు వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా డిప్యూటీ సిఎం పర్యటన సజావుగా సాగేలా పటిష్టమైన బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని ఎస్‌పి అధికారులకు సూచించారు.



జగన్‌తో వెంకటరమణ

వైసిపి జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి - దెందులూరు

వైసిపి జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆ పార్టీ సీనియర్ నేత ఉంగుటూరు నియోజకవర్గ యువనేత నౌడు వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధినేత వైఎస్.జగన్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వైసిపి బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. వైసిపి బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రమంతా కలియ తిరుగుతూ బిసిల ఐక్యమత్యం, సమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధి, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా చేస్తున్న కృషికి ఫలితంగా జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రావడం పట్ల ఉంగుటూరు నియోజకవర్గంలో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, రాష్ట్రం నలుమూలల వైఎస్ఆర్సిపి శ్రేణులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీలు

మండవల్లి : ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంఇఒ ఎస్.రత్నసునాదం తెలిపారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం మండల పరిషత్ బేసిక్ ప్రాథమిక పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల నిర్వహించిన ఎస్ఎ-1 పరీక్షలకు సంబంధించిన అసెస్ మెంట్ బుక్లెట్స్‌ను తరగతివారీగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

క్లాప్ మిత్రాలకు శిక్షణ


ప్రజాశక్తి - ముసునూరు

క్లాప్ మిత్రాల ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత వాతావరణం నెలకొనడంతో పాటు సుందర గ్రామాలుగా తీర్చి దిద్దుతున్నారని ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు తెలిపారు. మండలంలోని వలసపల్లి గ్రామ సచివాలయంలో మండలంలోని 16 గ్రామాల క్లాప్ మిత్రాలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంతో పాటు, చెత్త పరిశోధన కేంద్రం ద్వారా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ఆదాయం సమకూర్చుకోవడం ఎలా అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చలసాని దామోదరరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


యుటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్ష అన్నారు. ముదినేపల్లిలో యుటిఎఫ్ వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అల్లూరు మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఎస్‌జిటిగా పని చేస్తున్న కట్టా యశోద కృష్ణ యుటిఎఫ్ మండల నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జి.సింహాచలం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



యశోదకృష్ణ



సింహాచలం

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చింతలపూడి ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ సమావేశ హాలులో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల మండలాధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కీటకాలన్నిటిలో దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకమని, అది మన రక్తాన్నే తాగి మనకు ప్రాణాంతకమైన అంటు వ్యాధులైన మలేరియా, డెంగీ జ్వరాలను సంక్రమింపజేస్తుందని, దోమల నిర్మూలన ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని జ్వాలా పరమేశ్వర కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నీలిమ, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు జ్వాలా పరమేశ్వర కాలనీలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మన గృహాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి శీతాకాలంలో సంభవించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, హనుమంతు, ఆరోగ, ఆశ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు టౌన్, రూరల్ పరిధిలోని ఆటో యూనియన్ల గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆటో యూనియన్ జిల్లా మహాసభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నగరంలో ఆటో కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన సిఐటియుకు ఏలూరు టౌన్, రూరల్ పరిధిలోని ఆటో యూనియన్‌లు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆటో స్టాండ్‌కు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఈ చలానాలు రద్దు చేయాలని, రాపిడ్ వంటి సంస్థలను నిలిపివేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ఏలూరు నగరంలో అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. మహాసభకు సిఐటియు ఏలూరు నగర్ ప్రధాన కార్యదర్శి మంచెల్ల ఇస్సాకు సౌహార్ధ సందేశాన్ని ఇచ్చారు. చక్రాల అమర్ కుమార్ జిల్లా అధ్యక్షులుగా, జె.గోపీ ప్రధాన కార్యదర్శిగా, నత్త వెంకటేశ్వరరావు కోశాధికారిగా, బి.చంద్రశేఖర్, ఎ.రాజు, కె.శ్రీను తదితరులతో ఈ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి

భీమడోలు : విద్యార్థులు ప్రతినిత్యం అందుబాటులో ఉన్న గ్రంథాలయ సేవలను వినియోగించుకొని విజ్ఞానవంతులు కావాలని పలువురు వక్తలు కోరారు. భీమడోలు గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టి.వెంకట ఉమామహేశ్వరరావు, ఇతర సభ్యులు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకులు గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేసేందుకు సహకరించిన అధికారులు, దాతలు, ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన 150 మందికి బహుమతి ప్రదానం కార్యక్రమాలను సంతపేటలో నిర్వహించారు. నిర్వాహకులు దాతలను, ప్రముఖులతో పాటు సుమారు 40 సంవత్సరాల క్రితం ప్రారంభమైన భీమడోలు శాఖా గ్రంథాలయంలో సీనియర్ చందాదారునిగా కొనసాగుతున్న సిటిజన్‌ను, గ్రంథాలయానికి నిత్య పాఠకులుగా కొనసాగుతున్న వ్యక్తిని సన్మానించారు. స్వచ్ఛంద సంస్థ మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడారు. భీమడోలు గ్రంథాలయ అభివృద్ధికి సంస్థ తరపున రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. తోటి విద్యార్థులు గ్రంథాలయ సభ్యత్వాలను తీసుకునేందుకు అవసరమైన సభ్యత్వం మొత్తాన్ని చెల్లించేందుకు పంతం నరసింహమూర్తి ముందుకు వచ్చారు.

పలుచోట్ల 'క్లీన్ అండ్ గ్రీన్'

ప్రజాశక్తి - దెందులూరు, పెదవేగి, పెదపాడు

దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదవేగి మండలం దుగ్గిరాల, పెదపాడు మండలం వట్లూరు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా పంచాయతీ అధికారి అనురాధ హాజరయ్యారు. పెదపాడు మండలం వట్లూరులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రూ.30 లక్షల స్వచ్ఛ భారత్ నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (40 బాలికల టాయిలెట్స్)ను ప్రారంభించారు. దెందులూరులో వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం అవసరమైన షెడ్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కొబ్బరి వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు మరో షెడ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఎంఎల్ఎ ప్రభాకర్ తెలిపారు. గ్రామాల్లో చెత్త సేకరణ తరలింపునకు సదరు యంత్రాలను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిని ఎంఎల్ఎ ప్రభాకర్ కోరారు.

భీమడోలు : గ్రామాన్ని పర్యావరణహితంగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0 కార్యక్రమంలో భాగంగా థీమ్-5గా గుర్తించిన గ్రీన్ అండ్ గ్రీన్ యాక్షన్ ప్లాన్ 2025-26వ ఆర్థిక సంవత్సరం కార్యక్రమం అమలుకు పొలసానిపల్లి గ్రామాన్ని మోడల్ ఎంపిక చేశారు. గత రెండు రోజులుగా కార్యక్రమంలో భాగం గా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉప సర్పం చులకు ఒక రోజు, స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామ ఆర్గనైజేషన్ సహాయకులకు మరొక రోజు శిక్షణా కార్య క్రమాలు నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం కార్యక్రమం అమల కోసం పొలసానిపల్లి గ్రామాన్ని మోడల్ గ్రామం గా ఎంపిక చేశారు. గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, క్లాప్ మిత్ర, ఇతరులకు శుక్రవారం ప్రత్యక్ష తరహాలో శిక్షణ ఇచ్చా రు. కార్యక్రమ అమలు తీరును సామర్లకోట, గ్రామపం చాయతీ శిక్షణ కేంద్రానికి చెందిన అధికారి రామకృష్ణ వచ్చారు. కార్యక్రమాన్ని పరిశీలించారు. దీనికి కోర్సు డైరెక్టర్‌గా ఎంపిడిఒ పాల్గొనగా, సహాయ డైరెక్టర్‌గా డిప్యూటీ ఎంపిడిఒ సుబ్బారావు వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమా లపై డివిజనల్ స్థాయి రిసోర్స్‌పర్సన్ సూర్య, మండల స్థాయి రిసోర్స్ పర్సన్‌గా గ్రామపంచాయతీ కార్యదర్శులు ముత్తయ్య, రత్నాకరరావు, వెంకట్రావు వ్యవహరించారు.

ముదినేపల్లి : గ్రామం శుభ్రం కోసం అందరం కలిసికట్టుగా పని చేశామని ఎంపిడిఒ వై.రామకృష్ణ అన్నారు. గురజ గ్రామంలో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో శుక్రవారం గ్రామాన్ని శుభ్రం చేశారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జనం నివసించే ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, సిఆర్‌పిలు, క్లీన్ గార్డులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే విధానంలో ప్రజలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీ చేసే విధానంలో ప్రజలను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బి.అశోక్, ఎఒ ఎం.రమణారావు, గురజ గ్రామ కార్యదర్శి ఎస్.హారిక, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రమేష్, గిరిజ, గోవర్ధన్‌రావు, సీతారామరాజు, పవన్ కుమార్, శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి :పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామాల పరిశుభ్రత పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు అన్నారు. మండల పరిధిలోని చొప్పరమెట్లలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, గ్రీన్ విలేజస్‌ల ఏర్పాటుపై పలు గ్రామాల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, క్లాప్ మిత్రాలకు ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణా తరగతిలో భాగంగా ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చొప్పరమెట్ల సర్పంచి కె.ఊర్మిళ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు విఒలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భీమడోలులో...



ముదినేపల్లిలో...



ఆగిరిపల్లిలో...

ఉమ్రా యాత్రికుల మృతికి సంతాపం

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇటీవల సౌదీ అరేబియాలో ఉమ్రా యాత్రికులు నమాజ్‌లు పూర్తి చేసుకొని మక్కా నుంచి మదీనాకు వెళ్తున్న సమయంలో ఆయిల్ ట్యాంక్ ఢీ కొట్టి 45 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతికి సంతాపం తెలుపుతూ కామవరపుకోట కొత్తూరు జామియా మస్జీద్‌లో శుక్రవారం నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ అధ్యక్షులు లాల్ జాన్ భాషా, కార్యదర్శి ఇబ్రహీం, సభ్యులు వజీర్ ఖాన్, బాబ్జాన్, యూసఫ్ ఆలీ, నూర్, భాషా, ఆషిక్ తదితరులు పాల్గొన్నారు.